జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026 పేజీలు: 7

### ప్రజా సంక్షేమం--అభివృద్ధి లక్ష్యంగా 99 రోజుల
# ప్రగతి ప్రణాళిక
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**ఇటిక్యాల ఏప్రిల్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి)** :ప్రజా సంక్షేమం,అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 10 ముఖ్యాంశాలను అజెండాగా తీసుకుని 99 రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఇప్పటికే జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించామని, గ్రామసభలు కూడా పూర్తి చేశామని చెప్పారు.మండల స్థాయి సమావేశాల అనంతరం నియోజకవర్గ స్థాయిలో కూడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా సర్వైకల్

### మహనీయుల పేరుతో ఉన్న ట్రస్ట్ భూమిని
# కాపాడేది ఎవరు?
**నిబంధనల్ని తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్లు**
**మాజీ సర్పంచ్ పాత్రపై అనుమానాలు**
**జాతీయ రహదారి పక్కన కోట్ల విలువైన భూమి అక్రమార్కుల చేతిలోకి**

**జడ్చర్ల, ఏప్రిల్ 16, ప్రజా జ్యోతి**

జడ్చర్ల పట్టణ నడిబొడ్డున, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన ట్రస్ట్ భూములు ప్రస్తుతం అక్రమార్కుల కబంధహస్తాలలో చిక్కుకున్నట్లు కనిపిస్తున్నాయి. మహనీయుల పేరుతో స్థాపించబడిన ఈ ట్రస్ట్ ఆస్తులు ప్రజాసేవకు వినియోగించాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు స్వలాభం కోసం చట్టాలను తుంగలో తొక్కుతూ ప్లాట్లుగా విభజించి విక్రయించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా, స్థానికంగా ప్రభావం కలిగిన వ్యక్తులు మరియు ఇన్ఫ్లుయెన్సర్ల మద్దతుతో ఈ అక్రమ వ్యవహారాలు మరింత దూకుడుగా సాగుతున్నాయనే ఆరోపణలు




### పతి ఒక్కరు బాధ్యతతో రోడ్డు నియమాలు
# పాటించాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి
- జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్



### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతోనే
# ప్రమాదాల నివారణ
- హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి
- జడ్చర్లలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- రోడ్డు భద్రతపై డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం



# ప్రజా సంక్షేమం--అభివృద్ధి లక్ష్యంగా 99 రోజుల ప్రగతి ప్రణాళిక

క్యాన్సర్ నివారణ సాధ్యమని14 ఏళ్ల బాలికలందరికీ ఈ వ్యాక్సిన్ అందిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లు రాని అర్హులైన వారికి తదుపరి విడతలో మంజూరు చేస్తామని పేర్కొన్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు.

పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు,బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నందున అందరూ వినియోగించుకోవాలని సూచించారు.సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని,తద్వారా పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు.రేషన్ కార్డులు లేని అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని,వాటి మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు.రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేయాలని,యూరియా వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు.రైతు బీమా,నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌లను అర్హులైనవారు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.'అరైవ్ అలైవ్' వారోత్సవాల సందర్భంగా రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.విద్య,వైద్య,సంక్షేమ శాఖల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు.ఎర్రవల్లి మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలపై వివరాలు అందించారు.గ్రామాల సర్పంచులు,ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుషిత,తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో మహేష్,సర్పంచ్ అనిత,ఇతర ప్రజాప్రతినిధులు,శాఖల అధికారులు,మహిళా సంఘాల సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

4,040004

## మహనీయుల పేరుతో ఉన్న ట్రస్ట్ భూమిని

# కాపాడేది ఎవరు?

వినిపిస్తున్నాయి. " ఇవి మా ప్లాట్లు-- ఎవరైనా అడ్డుకుంటే కేసులతో ఇబ్బంది పెడతాం" అనే బెదిరింపులతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఎవరైనా ముందుకు వచ్చి ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతూ వ్యవహరిస్తున్న తీరు పలువురుని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. వీరి తీరు చట్టపరమైన వ్యవస్థలపై కూడా సవాల్ విసురుతున్న దుస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో మాజీ సర్పంచ్ ప్రమేయం ఉందన్న విమర్శలు మరింత సంచలనానికి దారితీస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిపిస్తూ, ట్రస్ట్ భూములను వ్యక్తిగత ఆస్తుల్లా మారుస్తున్నారని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. బాలానగర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నాడనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రజలకు సేవ చేయాల్సిన వృత్తిలో ఉండి, అక్రమాలకు పాల్పడుతున్నాడనే విమర్శలు అతనిపై తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థలను అడ్డంగా ఉపయోగించుకుంటూ, తమ తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అత్యంత విలువైన జాతీయ రహదారి పక్కనున్న ఈ భూములు రియల్ ఎస్టేట్ మాఫియాకు వేదికగా మారడం స్థానిక ప్రజలను కలవరపెడుతోంది. కోట్ల రూపాయల లావాదేవీలు గోప్యంగా జరుగుతున్నాయని, అధికార యంత్రాంగం చూస్తూ కూడా చూడనట్టుగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ, ట్రస్ట్ ఆస్తులపై ప్రజల నమ్మకం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని, ట్రస్ట్ భూముల అసలు స్థితిగతులను వెలికి తీసి, అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేదంటే చట్టాన్ని బేఖాతరు చేస్తూ వ్యవహరించే ఈ రియల్ ఎస్టేట్ దందా మరింత విస్తరించి, సామాజిక న్యాయం, ప్రజా హక్కులు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తున్నారు.

# కోస్గి పట్టణ సమగ్రాభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పట్టణంలో నిర్మిస్తున్న సైన్స్ మ్యూజియం పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పక్కనే ఉన్న మున్సిపల్ పార్కును పరిశీలించారు. బస్టాండ్ మలుపు దారి వద్ద జంక్షన్ ఏర్పాటు కోసం అధికారులకు సూచనలు చేశారు. అలాగే రూ.10.50 కోట్లతో కోస్గి పట్టణ డంపింగ్ యార్డ్ కు సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణ పనులను డంపింగ్ యార్డుకు వెళ్లి పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తాచెదారానికి నిప్పు ఎందుకు పెట్టారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. యార్డులో మిగిలిన ఇతర పనుల ఆలస్యంపై సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కోస్గి పట్టణంలో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ( మురుగునీటి వ్యవస్థ) పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తిస్థాయిలో పనులు కొనసాగడం లేదని, అసలు పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే ఆనవాళ్లే కనిపించడం లేదని కలెక్టర్ పబ్లిక్ హెల్త్, అర్ అండ్ బీ, మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని మూడు జోన్లుగా విభజించి చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఈ ఈ విజయ్ భాస్కర్ గూగుల్ మ్యాప్ తో కోస్గి పట్టణ స్వరూపం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (తుపాను నీటి పారుదల నెట్ వర్క్) మూడు జోన్ల నిర్మాణం గురించి చిత్ర పటం ద్వారా కలెక్టర్ కు క్రుప్తంగా వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగు నీటి నిల్వ కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణంలో మందకొడిగా సాగుతున్నాయని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళి కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.305 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, హై మాస్ట్ లైట్లు, జంక్షన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, అప్రోచ్ రోడ్లు, మేజర్ లింక్ రోడ్స్, సీసీ, డ్రైనేజీల నిర్మాణాలు, చెరువుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితి గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ గంటన్నర పాటు చర్చించారు. అయితే కాంట్రాక్టర్ అభివృద్ధి నిర్మాణ పనులను కూలీలు లేరని, పండగలు ఉన్నాయనే కారణాలతో నిర్మాణ పనులను నెలల తరబడి నిలిపి వేస్తున్నాడని కోస్గి మున్సిపల్ చైర్మన్ ఎన్. నరేందర్, పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న మిగతా పనులను నిర్ణీత గడువు లోపే పూర్తి చేయించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనులు ముందుకు సాగుతాయని, ఆయా శాఖల అధికారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కడ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, విద్యుత్ శాఖ ఎస్.ఈ. నవీన్, డి ఆర్ డి ఓ మొగులప్ప, పంచాయతీరాజ్ ఈ.ఈ. అశోక్, ఆర్ అండ్ బి అధికారి శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సరిత, మున్సిపల్ ఇంజనీర్, మేనేజర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం కోస్గి పట్టణంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ సభకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ ఎన్ నరేందర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పట్టణ సభ లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం 290 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారని, అందుకుగాను 10 వేల కోట్లకు పైగా మహిళలకు ఆదా అయిందని తెలిపారు. అలాగే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందజేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# పతి ఒక్కరు బాధ్యతతో రోడ్డు నియమాలు పాటించాలి

నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్ లో గురువారం ప్రజా పాలనలో భాగంగాజిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్ష శిబిరానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న డ్రైవర్లు అనగా లారీ డ్రైవర్లు,ఆటో డ్రైవర్లతో పాటు ఇతర డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ మన దేశంలో ప్రమాదాలుఎక్కువగా అయి డ్రైవర్లు మరియు ప్రయాణికులు చనిపోతున్నారని దీనికి ఒక కారణం కంటి చూపు కూడా కావచ్చని కావునా అందరూ పోలీస్ శాఖ నిర్వహించిన ఐ క్యాంప్ లో మీరందరు కంటి పరీక్షలను టెస్టులను చేసుకుని తగిన చికిత్స తీసుకొని మీ యొక్క ఆరోగ్యాన్ని మీ జీవితాన్ని కాపాడుకోవాలని అన్నారు.అనంతరం అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోసగటున ప్రతి నాలుగు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని,వీటిలో ఎక్కువ శాతం యువత మృతి చెందుతున్నారని,ప్రతి ఒక్కరు బాధ్యతగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు అరికట్టవచ్చని అన్నారు.వాహనం నడిపే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ఫోన్ మాట్లాడుతూ,మద్యం సేవించి, రాంగ్ రూట్లో,అతివేగంగా,నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదని,అలాగే వాహనం నడిపేటప్పుడు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని బాధ మిగులుతుందని,రోడ్డు నియమాలు పాటించి వాహనాలు నడిపితే కొంతవరకైనా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.ఈ ాార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్,సిఐ అశోక్ రెడ్డి,డిసిఆర్బిసిఐ ఉపేంద్రరావు,ఎస్సై గోవర్ధన్,ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్,ప్రశాంత్ నాగర్ కర్నూల్ ూూ అధికారి రమేష్ రెడ్డి తోపాటు డ్రైవింగ్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి బ్యూరో)**

: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్‌లో పోలీసు శాఖ, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడటమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

గత ఏడాది రాష్ట్రంలో సుమారు 7500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, వీరిలో 70 శాతం ద్విచక్ర వాహనదారులు, 30 శాతం కాలినడకన వెళ్లేవారేనని తెలిపారు. ముఖ్యంగా యువతే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి స్ట్రాప్ బిగించుకోవాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. భారీ వాహనాల డ్రైవర్లు ఎడమవైపు ప్రయాణించడంతో పాటు రాత్రి వేళల్లో హెడ్లైట్లను నియంత్రించాలని సూచించారు. ప్రతి గ్రామంలో గ్రామ సభల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాల పాటనతోనే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. జడ్చర్లలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని త్వరలో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా ఎస్పీ దరావత్ జానకి కూడా రోడ్డు భద్రతపై ప్రజలకు సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 26 బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత హెల్మెట్లు, మెడికల్ కిట్లు, డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ చేయడంతో పాటు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే ప్రమాదరహితంగా సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జోగులాంబ రేంజ్ డి.ఐ.జి ఎల్ యస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్.పి డి. జానకి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి

# జాగ్రత్తగా డ్రైవింగ్ చేయండి..

## ప్రమాద రహితంగా గమ్యాలు చేరుకోండి...



**కొల్లాపూర్ ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**

రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, ప్రమాద రహితము గా క్షేమం గా తమ గమ్యస్థానాలను చేరుకోవాలని కొల్లాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నాయక్ ఎస్ఐ బండారి సురేష్ వాహనదారులకు విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. రోడ్డు సేఫ్టీ డే సందర్భం గా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లోని గాంధీ స్మారకోనత ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రోజు పోలీసు అధికారులు వాహనాల ను నడిపే వారికి రోడ్డు నియమ నిబంధనల గురించి అవగాహనను కల్పిస్తూ పలు విషయాలను వాహనదారులకు తెలియజేశారు. ముఖ్యము గా తల్లిదండ్రులు, అలాగే వాహనదారులు 18 సంవత్సరాలు నిండని చిన్నపిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇవ్వకూడదు అని అలా ఇస్తే వాహనాలను నడిపేందుకు ఇచ్చిన తల్లిదండ్రుల పైన వాహనాల యజమానుల పైన చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు వాహనదారులను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదు అని వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా వాహనం నడిపేందుకు మోటార్ వెహికల్ అధికారుల తో ధ్రువీకరించబడిన డ్రైవింగ్ లైసెన్సును పొంది ఉండాలని, రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని పోలీస్ సీఐ శంకర్ నాయక్ ఎస్ఐ బండారి సురేష్ విద్యార్థినీ విద్యార్థులకు సమావేశం లో పాల్గొన్న కొల్లాపూర్ పట్టణ ప్రజలకు మోటారు డ్రైవింగ్ పై నియమ నిబంధనలపై అవగాహనను కల్పిస్తూ తగిన జాగ్రత్తలను కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో భాగం గా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థినీ విద్యార్థులు కొల్లాపూర్ పట్టణ ప్రజలచే మానవహారం ను నిర్వహించారు. రోడ్డు భద్రత దృష్ట్యా నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని మద్యం తాగి వాహనాలు నడపమని హెల్మెంటు లేకుండా వాహనమును నడపమని చిన్న పిల్లలకు వాహనాలు నడపడానికి ఇవ్వమని కొల్లాపూర్ పట్టణ ప్రజలచే పోలీసు అధికారులు ప్రతిజ్ఞను చేయించారు. ఈ రోడ్ సేఫ్టీ డే కార్యక్రమం లో కొల్లాపూర్ మండల విద్యాధికారి ఇమ్మానియేల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బంగారు శోభారాణి ఉపాధ్యాయుల నరేందర్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు కొల్లాపూర్ పట్టణ ప్రజలు పాల్గొన్నారు

# రోడ్డు నియమ నిబంధనలు పాటించండి

## క్షేమ కరమైన ప్రయాణాన్ని చేయండి



**కొల్లాపూర్ ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**

వాహన దారులు ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ చట్టం ప్రకారం తగిన ధ్రువ పాత్రాలను దగ్గర పెట్టుకొని వాహనాలు నడపాలని క్షేమ కరమైన ప్రయాణాన్ని, సురక్షితముగా గమ్యస్థానాలను చేరుకోవాలని కొల్లాపూర్ మండల పోలీస్ ఎస్ఐ బండారి సురేష్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లోని ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం పోలీస్ సిబ్బంది చే ఎస్సై వాహనాల తనిఖీని చేశారు. వాహనదారులు తాము నడిపే బండ్లకు సంబంధించిన ఆర్సీలు డ్రైవింగ్ లైసెన్సులు హెల్మెట్లు ధరిస్తున్నారా లేదా అనే విషయాల గురించి ఎస్సై తమ సిబ్బందితో వాహనాలను చెక్ చేశారు. ఈ సందర్భం గా ఎస్సై వాహనదారులతో మాట్లాడుతూ వాహనాలు నడిపేందుకు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం సంబంధిత అధికారులతో వాహనాలు నడిపేందుకు తగిన



నైపుణ్యం, సామర్థ్యం అర్హత ఉన్నట్లు డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికెట్లు పొంది ఉండాలని, ఆర్ సి ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు దగ్గర పెట్టుకోవాలని, తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణము చేయాలని ఇద్దరు మించి ఎక్కువ మంది ప్రయాణం చేయకూడదు, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అని వాహనదారులకు ఎస్ఐ బండారి సురేష్ అవగాహనను కల్పింస్తూ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు వాహనాలను ఇవ్వకూడదని, చిన్నపిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇచ్చిన వాహనదారుడిపైన లేదా వారి తల్లిదండ్రుల పైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ ఈ సందర్భం గా చిన్న పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇచ్చే తల్లిదండ్రులను

# పలు సమస్యల పైన డిపిఓకు వినతిపత్రం



**కొల్లాపూర్ ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు తమటం సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా పంచాయితీ అధికారి.డి.పి.ఓ.ను కలిసి వినతి పత్రం సమర్పించిన భారతీయ జనతా పార్టీ నేతలు.కొల్లాపూర్లో ఈ మధ్యకాలంలో పంచాయతీ కార్యదర్శులు విధుల నుండి సస్పెండ్ కావడానికి గల కారణాలను,గ్రామాలలో జరుగుతున్నటువంటి పలు సమస్యల గురించి అడిగి తెలుసుకోవడం జరిగినది. అదేవిధంగా గ్రామాలలో నీ పలు సమస్యలను తెలియజేసి ఆ సమస్యలను పరిష్కరించాలని గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని డి పి ఓ కు వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలో. బిజెపి రాష్ట్ర నాయకులు జలాల్ శివుడు, జిల్లా నాయకులు పధిర భీమేష్,జిల్లా కార్యదర్శి తిరుమల్ యాదవ్,బొల్లె జగన్,మేకల శివ,చంద్రశేఖర రావు,రమేష్ గౌడ్, పిల్లి నాగరాజు,కురుమూర్తి నాయక్,భరత్ యాదవ్, బాలకృష్ణ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభం

**గద్వాల ఎప్రిల్ 16(ప్రజా జ్యోతి):**

గద్వాల లోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.మీనాక్షి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, డిగ్రీ కోర్సుల ప్రవేశాల కోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసిందని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.దోస్త్ ద్వారా ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందదలచిన విద్యార్థులకు ఈ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా పూర్తిగా ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు.దోస్త్ కోఆర్డినేటర్ పి.సురేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేసి ఉండాలని,అలాగే 10వ,తరగతి మెమోలోని పేరు,ఆధార్ కార్డులోని పేరు మధ్య ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు.దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌కు సంబంధించిన వివరాల కోసం దోస్త్ కో ఆర్డినేటర్ పి.సురేష్ బాబు ను 9052250692 నంబర్‌లో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



# అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం

**కొల్లాపూర్ ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్కు వివిధ అంశాల పైన వినతి పత్రాన్ని సమర్పించినభారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు,తమటం సాయి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.కొల్లాపూర్ లో ఉండవలసిన హర్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఇతర ప్రాంతాలకు ఎలా వెళ్ళిందో స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానం చెప్పాలి,అలాగే కొల్లాపూర్ పేరు ఉన్న కళాశాలను కొల్లాపూర్ లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్.కొల్లాపూర్ లో మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఓ పి గైనకాలజిస్ట్ రెగ్యులర్ డాక్టర్లను ఏర్పాటు చేయాలని హాస్పిటల్లో సరైన సదుపాయాలు రోగులకు అందడం.లేదని అదేవిధంగా సరైన వైద్యము అందడం లేదని రోగులు వివరిస్తున్నారు. తక్షణమే రోగులకు అందుబాటులో డాక్టర్లు మెడిసిన్స్ సరైన పద్ధతిలో అందజేయాలి అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు,

కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ షాపులు గత రెండు సంవత్సరాల క్రితం టెండర్లలో లక్షల లక్షలు పాటలు పాడిన వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి ఆ షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు మళ్లీ రీ టెండర్లు పెట్టి కొల్లాపూర్ లోని నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
లేనియెడలో కొల్లాపూర్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొల్లాపూర్ లో ఉన్న సమస్యల పైన అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు జలాల్ శివుడు, జిల్లా నాయకులు తమటం సాయి కృష్ణ గౌడ్ పధిర భీమేష్,జిల్లా కార్యదర్శి తిరుమల్ యాదవ్,బొల్లె జగన్,మేకల శివ,చంద్రశేఖర రావు,రమేష్ గౌడ్, పిల్లి నాగరాజు,కురుమూర్తి నాయక్,భరత్ యాదవ్, బాలకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగినది.



## కనుకుర్తి గ్రామం లో పశువుల దొడ్డి వద్ద అగ్ని ప్రమాదం తప్పించిన జర్నలిస్ట్





**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16( ప్రజా జ్యోతి)**

దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో భూ నిర్వాసితులతో సమావేశం సందర్భంగా అక్షిత జిల్లా రిపోర్టర్ టీ. హన్మంత్ న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన సందర్భంలో అప్రమత్తంగా వ్యవహరించి అగ్ని ప్రమాదాన్ని అడ్డుకున్నారు.

గ్రామంలోని రైతు వేదిక కు అనుకోని ఉన్న పశువుల దొడ్డి వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్టు గమనించిన ఆయన వెంటనే స్పందించి,దగ్గరలో లభ్యమైన నీటిని ఉపయోగించి మంటలను ఆర్పారు.ఆయన సమయోచిత చర్యల వల్ల మంటలు వ్యాపించకుండా అడ్డుకట్ట పడింది.ఈ ఘటనలో ముఖ్యంగా పశువుల గడ్డి (మేత) మంటలకు ఆహుతి కావడం తప్పించబడింది. లేకపోతే భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.టీ. హన్మంత్ తీసుకున్న ఈ ధైర్యవంతమైన చర్యలకు సర్పంచ్ నారాయణ,గ్రామస్తులు అభినందనలు తెలిపారు. సమయానికి స్పందించి ప్రమాదాన్ని నివారించడం ద్వారా ఆయన బాధ్యతాయుతమైన పౌరునిగా గా నిలిచారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం

### -ప్రతి హిందువు ఐక్యతో మెలగాలి
### -ఆచార్య శంకరానంద స్వామి

**నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

హిందూ సమాజం జాగృతం కావాల్సిన ఆవశ్యకత ఉందని ఆచార్య అభినవ శంక రానందస్వామి అన్నారు.ఆర్ ఎస్ఎస్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ బస్తీలో నిర్వహించిన హిందూ సమ్మేలణంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధర్మప రిరక్షణకోసం హిందువుగా జీవించి తమ పిల్లలు, కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని భారత దేశం గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలిసేలా ధార్మిక కార్యక్రమాలు




నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో వక్త భాస్కరయోగి,ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు,కార్యదర్శి పిడికిళ్ల జంగయ్య, పట్టణ కార్యవహ్ వేముల సురేశ్ పాల్గొన్నారు.

## చదువే మన బ్రతుకును మార్చేది చదువే మన ఆస్తి

### డాక్టర్.ప్రేమ్ కుమార్

**అలంపూర్ డివిజన్(ప్రజాజ్యోతి) ఏప్రిల్ 16:**

ఇంటర్మీడియట్ స్టేట్ సెకండ్ ర్యాంకర్ కు సాధించిన విద్యార్థికి సన్మానం.చదువుతో ఏదైనా సాధించొచ్చు అని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్.ప్రేమ్ కుమార్ అన్నారు.గద్వాల మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ లో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించిన మానవపాడు గ్రామంకి చెందిన గురుకుల విద్యార్థిని సన ను సన్మానించారు సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చదువుతో ఉన్నత స్థాయి చేరుకోవచ్చని దృఢ సంకల్పంతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆయన అన్నారు.మానవపాడు గ్రామంకి చెందిన సన స్టేట్ ర్యాంక్ సాధించడం గద్వాల జిల్లా కి గర్వకారణం అని విద్యార్థులు సన ను ఆదర్శంగా తీసుకొని చదవాలని సూచించారు.సన జీవితంలో ఇంకా ఉన్నత



చదువులు చదివి పేదలకు.అవసరతలో ఉన్నవారికి సహపడాలని.ఆమె చదువు ఏదో ఒక రకంగా సమాజానికి ఉపయోగ పడాలని సన ను కోరారు.

## 30న విద్యా సదస్సును జయప్రదం చేయండి.

**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టి పి టి ఎఫ్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు విద్యా సదస్సును జయప్రదం చేయాలని టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప కోరారు. విద్యా రంగంలో వస్తున్న నూతన మార్పులను అర్థం చేసుకొని పటిష్టవంతమైన విద్యా ప్రణాళిక కోసం కృషి చేసేందుకు టిపిటిఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా సదస్సును నిర్వహిస్తున్నదని ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యా సంచాలకులు ఏ నవీన్ నికోలాస్ గారు విద్యావేత్తలు ప్రొఫెసర్ హరగోపాల్, చింతకింది కాసిం ఆంధ్రజ్యోతి పూర్వ ఎడిటర్ కె శ్రీనివాస్ లు పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు మేధావులు, విద్యార్థులు యువజనులు సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా విద్య కార్యాలయం ముందు సూపరింటెంట్ ఏ నరసింహారెడ్డి తో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ ఓ లు నాగార్జున రెడ్డి, శ్రీనివాస్, డీఈఓ కార్యాలయ సీనియర్ నాయకులు ఉదయభాను టిపిటిఎఫ్ నాయకులు అలెనూరి రామకృష్ణ, వెంకటప్ప ,ఉదయ్ కుమార్ అశోక్ ,గజలప్ప తదితరులు పాల్గొన్నారు.



### గద్వాల మున్సిపల్ కమిషనర్ వైఖరి మార్చుకోవాలి



**గద్వాల(ప్రజా జ్యోతి) ఏప్రిల్ 16:**

గద్వాల పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ,కార్యదర్శి వీవీ నరసింహ డిమాండ్ చేశారు.గద్వాల మున్సిపల్ కమిషనర్ కార్మిక వ్యతిరేక ధోరణి విడనాడాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు, వేతనాలు,భద్రతా సామగ్రి అందించడం లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్మిక పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మహేష్ కుమార్,కమిటీ సభ్యులు లలితమ్మ,శివ,పరమేష్, డి.రవి,కేపీ నరసింహ, శ్రీనివాస్,జాఫర్, రూతమ్మ,రాము, రవణమ్మ,జయమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు





**గద్వాల (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 16:**

జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గద్వాల రూరల్ ఎస్సై సి.హెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ "అరైవ్--అలైవ్" కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు.రహదారి ప్రమాదాల నివారణకు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై సూచించారు.

## హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ

**అలంపూర్,ఇటిక్యాల (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 16:**

జిల్లా ఎస్పీ టీ.శ్రీనివాసరావు ఆదేశాల మేరకుఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తా వద్ద నేడు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు.హెల్మెట్లు ధరించి నిర్వహించిన ఈ ర్యాలీలో అలంపూర్ సీఐ ప్రదీప్ కుమార్,ఇటిక్యాల ఎస్ఐ కె.రవి,కోదండపురం ఎస్ ఐ.సబిరెడ్డి తరుణ్ కుమార్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ర్యాలీ ద్వారా ప్రజల్లో సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంపొందించారు.



# తెలంగాణ మోడల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

- ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే చోట విద్య
- నాణ్యత, గడువు పాటిస్తూ మోడల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





**అచ్చంపేట ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి )**

గురువారం వంగూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ (మోడల్) స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ఒకే చోట అందించే విధంగా ఆధునిక సదుపాయాలతో తెలంగాణ మోడల్ స్కూల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, బాత్రూములు, ఆట స్థలం వంటి అన్ని ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాఠశాల భవనం నిర్మాణం వేగవంతంగా కొనసాగుతున్నప్పటికీ, పనుల్లో నాణ్యతకు ఎలాంటి లోపం రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాల భవనం బలంగా, సురక్షితంగా ఉండేలా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అలాగే, తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఏర్పాటు చేయాలని,పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా ఆలస్యం గమనించినట్లయితే తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఇక పాఠశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం లభిస్తుందని, ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మరింత పెరుగుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

**ఆర్ అండ్ బీ పోలీసు అధికారులు**
**సమన్వయంతో ప్రమాదాలను అరికట్టాలి**
**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ( ప్రమాదకర ప్రదేశాలు) లో ఇకపై ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు రోడ్లకు సమీపములో ఉన్న స్కూల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్ల దగ్గర సూచిక బోర్డులు హజార్డ్ మార్కర్లు ఏర్పాటు చేయాలని, కల్వర్టుల దగ్గర రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ మాట్లాడుతూ .... కోసిగి సర్కిల్లో మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి 167 నాచారం అవుట్ స్టిక్కర్లు వేయాలన్నారు. మరికల్ సర్కిల్లో బ్లాక్ స్పాట్స్ టాప్ 10 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని తెలిపారు. నారాయణపేట సర్కిల్ ఇతర రహదారి మున్సిపాలిటీ పరిధిలో 2025లో 13మరణం సంభవించిందని 18 మంది గాయపడ్డారని తెలిపారు. నారాయణపేట సత్యనారాయణ ఎక్స్ రోడ్లు గత 72 మరణాలు సంభవించాయని మక్తల్ మున్సిపాలిటీలో 2025లో 10 మరణాలు తొమ్మిది మంది గాయపడ్డారని తెలిపారు. దండు ఎక్స్ రోడ్ నల్లజానమ్మ గుడి వద్ద, మక్తల్ బస్టాండ్ చందాపూర్ లో బ్లాక్ స్పాట్ ఉన్నాయని మన ప్రాంతాలలో భారీకేడ్లు సూచిక బోర్డులు జీబ్రా క్రాసింగ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
మరికల్ టౌన్ పెద్ద చింతకుంట జాతీయ రహదారి రంబుల్ ట్రిప్స్ విత్ స్టడీస్ యాక్సిడెంట్ ఏరియా డ్రైవ్ స్లో తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్. ఈ వెంకట రమణ, డిఎస్పి నల్లపు లింగయ్య ,ఆర్టీవో మేఘా గాంధీ, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, ఆర్టీసీ డిఎం లావణ్య డీఈవో గోవిందరాజు డిఎం అండ్ హెచ్ ఓ జయచంద్ర మోహన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు

**అలంపూర్ డివీజన్‌(ప్రజాజ్యోతి) ఏప్రిల్16:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా “అరైవ్--అలైవ్” కార్యక్రమం నిర్వహించారు.ఎర్రవల్లి మండల కేంద్రంలో గద్వాల డీఎస్పీ మొగలయ్య,అలంపూర్ సీఐ.ఎస్ఐల ఆధ్వర్యంలో గురువారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ కంటి పరీక్షలు నిర్వహించారు.అదేవిధంగా బైక్ ర్యాలీ చేపట్టి వాహనాల తనిఖీలు కూడా చేశారు.రహదారి ప్రమాదాల నివారణకు డ్రైవర్లు భద్రతా నియమాలు తప్పక పాటించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కోదండపురం ఎస్ఐ అరుణ్ కుమార్, ఇటిక్యాల ఎస్ఐ కె.రవి, ఉండవెల్లి ఎస్ఐ శేఖర్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం



**నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు తాజా ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు గౌరవాన్ని తెచ్చి ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సుప్రజాత విద్యార్థినులను అధ్యాపకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,విద్యార్థినులుభవిష్యత్తులో దృఢ సంకల్పంతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా ముందుకు సాగాలని తమ తల్లిదండ్రులు,కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.తక్కువ మార్కులు వచ్చిన మరియు ఫెయిల్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 20, 2026 సాయంత్రం 5:00 గం: లోపు కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉండే కోడు గ్రామంలో ఎండ దెబ్బలకు వ్యక్తి మృతి



**నర్వ ఏప్రిల్ 18 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండలం ఉండే కోడ్ గ్రామంలో ఎండ దెబ్బలకు పాలనకు వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, అదే గ్రామానికి చెందిన, ఎండి సర్దార్ 40, అనే వ్యక్తి వృత్తిరీత్యా వంటకాపరుగా పనిచేస్తు జీవనం కొనసాగించేవారు, రెండు రోజుల క్రితం ఎండ దెబ్బలకు అస్వస్థతకు గురై, చికిత్స నిమిత్త మహబూబ్నగర్కు, అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించగా గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు, మృతునికి భార్య ఆశ బి ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు,. మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు

## దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో రైతులతో ముచ్చటించిన శివకుమార్ రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

నేడు కానుకుర్తి గ్రామంలో రైతు వేదిక దగ్గర నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగానికి పైగా రైతులకు నష్టం పరిహారం చెల్లించామని, మిగతా రైతులకు కూడా త్వరలో పరిహారం అందిస్తామని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, పనులు సాఫీగా జరిగేలా సహకరించాలని కోరారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. శివకుమార్ రెడ్డి గారి హామీతో సంతృప్తి చెందిన రైతులు పనులు త్వరగా పూర్తి చేయడానికి సహకరిస్తామని తెలిపారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం

-వైద్య సదుపాయాల లేమి... చిన్నంబావిలో ఆసుపత్రి కోరిన ప్రజాప్రతినిధులు
-చిన్నంబావి మండలంలో నూతన ఆసుపత్రి నిర్మించాలి... వైద్యం, రైతు సమస్యలపై సర్పంచుల ఆగ్రహం

**చిన్నంబావి, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి)**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి డిపిఓ రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో వివిధ సంక్షేమ పథకాల అమలు,లబ్ధిదారుల వివరాలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రైతు భరోసా కింద 10,820 మంది రైతులకు రూ.16.కోట్లు 57 లక్షలు జమ చేయగా, రుణమాఫీ కింద 4,009 మందికి రూ.3,413.42 లక్షలు మాఫీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు 294 మందికి రూ.379 లక్షలు మంజూరు చేశారు. 4,739 మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుండగా, చేయూత పెన్షన్లు 12,520 మందికి అందుతున్నాయి. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలుగా రూ.23 కోట్లు మంజూరు చేయగా, 9,250 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కొత్త రేషన్ కార్డుల కోసం 9,502 దరఖాస్తులు రాగా, అందులో 3,344 కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరానికి వరి ధాన్యం సేకరణలో భాగంగా 786 మంది రైతుల ఖాతాల్లో రూ.10.83. 63.489 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 83,217 పని దినాలు సృష్టించి రూ.2.56 కోట్ల వేతనాలు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.అయితే సమావేశంలో ప్రజాప్రతినిధులు మండలంలోని సమస్యలను తీవ్రంగా ప్రస్తావించారు. మండలంలో సరైన వైద్యసదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆసుపత్రి లేక ప్రాణనష్టం జరుగుతున్న ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నంబావిలో నూతన ఆసుపత్రిని తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.మండలంలో 56 టీబీ కేసులు, 730 షుగర్ రోగులు, 730 డెంగీ కేసులు, 23 మలేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు.అధికారుల పనితీరుపై కూడా సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలకు అధికారులు తరచూ రాకపోవడం, సమస్యలను పట్టించుకోకపోవడం, సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా రైతు సర్వేలు నిర్వహించడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత లేని వ్యక్తులను సర్వేలకు నియమించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభంపై స్పష్టత ఇవ్వాలని సర్పంచులు డిమాండ్



చేశారు. అయ్యవారిపల్లి గ్రామంలో మహిళా సంఘాల్లో రూ.7 లక్షల వరకు నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రామ సర్పంచ్ ఆరోపించగా, ఆడిట్‌లో అవకతవకలు బయటపడ్డాయని అధికారులు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు పేర్కొంటూ త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రామస్వామి, తాహాశీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, ఏపీఓ ధనుంజయరాజు తదితరులు తమ శాఖల పనితీరును వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఫారెస్ట్ శాఖ అధికారులు చెట్ల సంరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఎస్ఐ రామన్ గౌడ్ ఈ సమావేశంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మొత్తానికి చిన్నంబావి మండల సమీక్ష సమావేశం సమస్యలతోనే నిండిపోయింది. ప్రజాప్రతినిధుల అధికార యంత్రాంగంపై ప్రశ్నలు లేవనెత్తింది. స్థానికంగా ఈ సంఘటన తీవ్ర చర్చకు దారితీసింది.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు సర్పంచులు. ఉప సర్పంచులు. వార్డు నెంబర్లు గ్రామ సెక్రెటరీలు ఉపాధి హామీ సిబ్బంది అంగన్ వాడి టీచర్లు ఆశా వర్కర్లు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో అభినందనీయం

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి)**

ప్రభుత్వం కల్పించే వసతి సదుపాయాలతో మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థిని, విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బందిని అభినందించారు. గురువారం కలెక్టర్ చాంబర్లో నారాయణపేట, మరియు మక్తల్ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఫలితాలలో 100% ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం బాలికల విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నదని దానిని అంది పుచ్చుకుని ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. నారాయణపేట బాయ్స్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ లో 95 శాతం పలితాలు సాధించడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎం డబ్ల్యూ ఓ రషీద్, విజిలెన్స్ అధికారులు జమీర్ ఖాన్, మసూద్, జహీర్, నారాయణపేట ప్రిన్సిపాల్ జగదీష్, మక్తల్ బాలికల ప్రిన్సిపల్ ఎలిజబెత్ రాణి ,స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నర్వలో సమీక్ష సమావేశం

## 16 నెలల పనితీరుపై శాఖల వారీ సమీక్ష..

**నర్వ ఏప్రిల్ 16 ( ప్రజా జ్యోతి)–**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై నర్వ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశం అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర అవలోకనంగా నిలిచింది. సర్పంచ్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అదనపు రెవిన్యూ కలెక్టర్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మల్లారెడ్డి, మండల ప్రత్యేక అధికారి కేతాన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గత 16 నెలల పనితీరుపై శాఖల వారీగా సమీక్ష చేపట్టారు. అన్ని శాఖల అధికారులు తమ తమ పనితీరుపై వివరాలు వెల్లడించారు. నేలస్థాయిలో కూడా అభివృద్ధి పనులు ప్రతిఫలిస్తూ, పలు రంగాల్లో పురోగతి స్పష్టంగా కనిపిస్తున్నదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు పంటల విస్తీర్ణం పెంపు, ఎరువులు--విత్తనాల సరఫరా, రైతు భరోసా, పంట బీమా అమలు వంటి అంశాల్లో సాధించిన పురోగతిని వివరించారు. రైతులకు అందుతున్న సేవలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో వసతులు పెరిగినట్లు వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల్లో కూడా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని సంబంధిత శాఖలు వెల్లడించాయి. అర్హులైన ప్రతి



కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు రెవిన్యూ కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని తెలిపారు. తహసీల్దార్ మల్లారెడ్డి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# బ్లూ కోల్ట్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ

– సురక్షిత విధుల నిర్వహణపై జిల్లా ఎస్పీ సూచనలు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి బ్యూరో)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్ సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బ్లూ కోల్ట్ సిబ్బంది అత్యవసర సేవల్లో కీలక పాత్ర పోషిస్తూ 100 కాల్స్‌కు తక్షణ స్పందన అందిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై వేగంగా ప్రయాణించాల్సి ఉండటంతో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే, బ్లూ కోల్ట్ సిబ్బంది బాధ్యతలు కేవలం కాల్స్‌కు స్పందించడం మాత్రమే కాకుండా ప్రమాద స్థలాలకు వేగంగా చేరుకోవడం, చట్టం-శాంతి భద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం చేయడం వంటి కీలక విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో వారి భద్రత అత్యంత ముఖ్యమని, సురక్షితంగా విధులు నిర్వర్తించడం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్‌కు జాతీయ ఎస్.టి. కమిషన్ సభ్యుడు రాక

- గిరిజన గ్రామాల్లో పర్యటన, సమీక్షా సమావేశం
- లాల్య నాయక్ తండా, రామ్ నాయక్ తండా, హన్వాడ మండలాల్లో సందర్శన... మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జాతీయ ఎస్.టి. కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లాకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మహబూబ్ నగర్ రూరల్ మండలం లాల్య నాయక్ తండా, రామ్ నాయక్ తండా, అలాగే హన్వాడ మండలంలోని గిరిజన గ్రామాలను సందర్శించనున్నారు.

ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిగతులను పరిశీలించనున్నారు. పర్యటన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్.పి., వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం. చత్రు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం





## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

**నారాయణపేట ఏప్రిల్ 16( ప్రజా జ్యోతి)**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన ' అరవి అలివి' కార్యక్రమం కింద గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ ఎస్సార్ గార్డెన్ లో ఆటో, టాక్సీ, టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం, కలర్ బ్లైండ్ వంటి సమస్యలు రావచ్చని, అందువల్ల డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలు సరిగా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గతంలో కంటి పరీక్షలు చేసుకున్న కొంతమందికి కళ్లద్దాలు అందించడం జరిగింది. ప్రస్తుతం కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడంతో పాటు తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందించబడతాయని చెప్పారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. డ్రైవర్లు తప్పనిసరిగా డిఫెన్స్ డ్రైవింగ్ పాటించాలని, వేగ పరిమితులను మించకుండా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలను పాటించాలి, మద్యం సేవించి వాహనం నడపకూడదు, కారులో సీట్ బెల్ట్, ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదు, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. అలాగే వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా 100 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో రామ్ చందర్, డీఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్, ఆర్టీఓ మేఘా గాంధీ, ఆర్టీఓ మెంబర్ పోశాల్ రాజేష్, సీఐ శివశంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరి నారాయణ బట్టడ్, కంటి వైద్య నిపుణులు డాక్టర్లు సునీల్, మల్లిక, సాయి ఆదిత్య, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# క్షేమంగా గమ్యాన్ని చేరుకొని... కుటుంబాన్ని కాపాడుకోండి!

**-- అచ్చంపేట డివిజన్ పోలీ సుల ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం**

**-- కంటి శిబిరాన్ని వినిగించుకున్న 160 మంది డ్రైవర్లు**

**-- అచ్చంపేట సీఐ నాగరాజు**

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

విధి నిర్వహణలో భాగంగా డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ, సురక్షితంగా గమ్యాన్ని చేరుకొని, తమ కుటుంబాలను కాపాడుకోవాలని అచ్చంపేట సీఐ నాగరాజు పేర్కొన్నారు. గురువారం అచ్చంపేట పట్టణంలో అరేవ్-అలెవ్ లో భాగంగా అచ్చంపేట పోలీస్ స్టేషన్లో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐ నాగరాజు అధ్యక్షత వహించగా, కూచికుల్లా రామచంద్రారెడ్డి, ఐ క్యాంప్ ఎల్వి ప్రసాద్ బృందంసౌజన్యంతో డీసీఎం, క్యాబ్, బస్సు డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని,167 మంది కంటి శుక్లాల పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ డ్రైవర్లకు ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా వాహనదారులు డిఎల్ తో పాటు ఇన్సూరెన్స్ ఫిట్నెస్ దస్త్రాలను తమ వద్ద ఉంచుకోవాలని డ్రైవర్లకు ఆయన సూచించారు. కాగా తల్లిదండ్రులు మైనర్ల కు వాహనాలు ఇచ్చి సహకరిస్తే, అనుకోనిసంఘటనలుజరిగినప్పుడు తల్లిదండ్రులు కూడా శిక్షలు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఈ సందర్భంగా సీఐ గుర్తు చేశారు. అదేవిధంగా పట్టణంలో త్రిబుల్ రైడింగ్ కి పాల్పడితే ఎంతటి వారికైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రయాణంలో భాగంగా బస్సుల్లో, క్యాబ్ ఆటోలలో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తానన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతే.. కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫ్తామాలజిస్ట్ జ్యోతి, ఎస్సైలు సద్దాం హుస్సేన్, రాజేందర్, అంజయ్య, హనుమంత్ రెడ్డి, శ్రీను, జయన్న, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు



# చిన్నంబావి మండల కేంద్రంలో ఎండ తీవ్రతతో వారపు సంత వెలవెల!

చిన్నంబావి, ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి) మండుతున్న ఎండలు వారపు సంతలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగడంతో చిన్నంబావి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సంత వెలవెలబోయింది. కొనుగోలుదారులు చాలా తక్కువ మంది రావడంతో వ్యాపారం సాగక దుకాణాలు వెలవెలబోయాయి. సాధారణంగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు వారపు సంతకు వస్తుంటారు. అయితే కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సంతకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు."ఎండల కారణంగా ప్రజలు బయటకు రావడం లేదు... రోజంతా కూర్చున్నా అమ్మకాలు లేవు" అని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మండలంలో ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



## బూరుగుపల్లిలో న్యాయ అవగాహన కార్యక్రమం

**-విద్యార్థుల్లో హక్కులపై చైతన్యం**

**న్యాయ హక్కులు, బాల కార్మిక నిషేధం, ట్రాఫిక్ నియమాలపై వివరాలు**



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ప్రజా జ్యోతి బ్యూరో):**
డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బూరుగుపల్లి ఎదిర మండలంలోని మహాత్మా జ్యోతి పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు న్యాయ హక్కులు, బాధ్యతలు, ఉచిత మరియు తప్పనిసరి విద్య హక్కు చట్టం, బాల కార్మిక నిషేధం, మానవ అక్రమ రవాణా, ట్రాఫిక్ నియమాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. న్యాయంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాపట్ల గ్రామంలో తాటి చెట్టుపై పిడుగు

**కొల్లాపూర్ ఏప్రిల్ 16 ప్రజా జ్యోతి**



పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల గ్రామంలో తాటిచెట్టు పైన పిడుగు పడిన దృశ్యం. గ్రామంలో ఈదురుగానులతో గురువుల మెరుపులతో కూడిన వారి వర్షం కురిసినది, గ్రామంలోని ప్రధాన రహదారిలోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో తాటి చెట్టుపై పిడుగు పడటం చెట్టు పూర్తిగా దగ్ధమైంది. వర్షంతో పడటంతో మొక్కజొన్న వేరుశనగ పంట కోసిన రైతులకు నష్టం చేస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కొడుకు మృతి షాక్‌తో తల్లి మృతి

### తూముకుంట గ్రామంలో విషాదం



అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 16: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం గురువారం తూముకుంట గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కురువ మల్లికార్జున్ (మల్లన్న) పంట పొలాల్లో పని చేస్తుండగా తీవ్ర ఎండ వడ తగిలి మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొడుకు మరణ వార్త విన్న తల్లి కురువ రంగమ్మ తీవ్రంగా దిగ్భ్రాంతికి గురై,ఆ వార్తను తట్టుకోలేక అకాల మరణం చెందింది. ఒకే రోజు తల్లి కొడుకులు మృతి చెందడంతో గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.
గ్రామంలో ఇలాంటి ఘటన మొదటిసారిగా జరగడంతో ప్రతి ఒక్కరూ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తల్లి కొడుకుల మృతితో తూముకుంట గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ప్రార్థించారు.